క్లుప్తంగా

తీరిన విద్యార్థుల ఇబ్బందులు

- బాసర ట్రిపుల్‌ఐటీ ఎదుట రెండు బస్‌షెల్టర్ల నిర్మాణం


బస్సుషెల్టర్‌లో విద్యార్థులు

సాక్షి స్పందన

బాసర: చదువుల తల్లి కొలువు దీరిన బాసర ఆర్జీయూకేటీ కళాశాల వద్ద బస్సు షెల్టర్ లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాకపోకలకు అవస్థలు పడేవారు. భైంసా–నిజామాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డుపై ట్రిపుల్ ఐటీ కళాశాల వద్ద కూర్చొనేందుకు స్థలం లేక ఎండలో, వానలో గంటల తరబడి బస్సుల కోసం నిల్చునేవారు. వీరి ఇబ్బందులపై సాక్షిలో మార్చి 30న నిలువ నీడ కరువు శీర్షికన కథనం ప్రచురితమైంది. వెంటనే బస్‌షెల్టర్ ఏర్పాటుకు పనులు ప్రారంభించిన అధికారులు ఇటీవల పూర్తి చేయించారు.

మేరు సంఘ కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

కడెం: మండలంలోని ఎలగడప గ్రామ మేరు సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మేరు సంఘం గ్రామ అధ్యక్షుడిగా రాపర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సన్నె నర్సయ్య, కోశాధికారిగా రాపర్తి సంతోష్, సభ్యులుగా గట్ల అశోక్, కర్నే శ్రీనివాస్, రాపర్తి లక్ష్మణ్, సత్తెన్న, రమణ, భూమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపారు.

కోతులతో జనం బెంబేలు


వృద్ధుడి గాయం చూపుతున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ గ్రామంలో కోతుల గుంపు సంచారంతో జనం బెంబేలెత్తుతున్నారు. కోతులు వింతగా ప్రవర్తిస్తూ దాడులకు తెగబడుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పలువురిపై దాడికి యత్నించి.. ఎర్రన్న అనే వృద్ధుడిని తీవ్రంగా గాయపరిచాయి. సంబంధిత అధికారులు గ్రామంలో కోతుల బెడద నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు పోయేదాకా చూస్తారా?


ఉడుంపూర్ సమీపంలో రోడ్డుపై పడేలా చెట్టు


గండి పోచమ్మ ఆలయ సమీపంలో పొంచి ఉన్న ముప్పు


ఈనెల 2న రోడ్డుపై విరిగిపడిన తుమ్మచెట్టు

కడెం: మండలంలోని దోస్త్‌నగర్ నుంచి ఉడుంపూర్, రాంపూర్, గండిపోచమ్మ ఆలయ సమీపంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెట్లు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలోనే నిత్యం ఉట్నూర్ వైపునకు వందలాది మంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో ఈ చెట్లు వాహనాలపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈనెల 2న ఉడుంపూర్ సమీపంలో భారీ తుమ్మ చెట్టు రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అటవీశాఖ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు స్పందించి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రమాదకర చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

‘మురుగు’ కష్టాలు

కుభీర్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఎస్సీ కాలనీకి ఆనుకొని ఉన్న మురుగు కాల్వ చెత్తాచెదారంతో నిండిపోయింది. దీంతో మురికి నీరంతా అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు రోడ్డుపైనే పారుతోంది. దోమలు వ్యాప్తి చెందడంతోపాటు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని.. పంచాయతీ సిబ్బంది సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చెత్తతో నిండిన కాలువ


రోడ్డుపై మురుగునీరు

ప్రశాంతంగా నిమజ్జనం


ఖానాపూర్: నిమజ్జనం కోసం వరుసలో..


నిర్మల్‌లో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. శనివారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర ఆదివారం మధ్యాహ్నం వరకు సాగింది. గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రేన్ సాయంతో నిమజ్జన ప్రక్రియ ముగించారు. శోభాయాత్రలో భాగంగా బ్యాండ్‌మేళాలు, డీజే చప్పుళ్ల నడుమ యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి. జగన్నాథ్‌రావు చౌరస్తాలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేశ్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దాతలు తాగునీరు, అల్పాహారం పంపిణీ చేశారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


లోకేశ్వరం : ధర్మోరలో నృత్యం చేస్తున్న యువకులు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర, అర్లి గొడిసెరా, లోకేశ్వరం తదితర గ్రామాల్లో గణేశుడి ప్రతిమల నిమజ్జనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని వీధుల గుండా యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పంచగుడి గ్రామ సమీపంలోని గోదావరి నదిలో నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన భారీ గణపతులను క్రేన్ సాయంతో నిమజ్జనం చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, పొట్టపెల్లి, రాచాపూర్ గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న గణనాథుడు



కుంటాల: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శ్రీరామ్ సేన ఏర్పాటు చేసిన మండపం వద్ద అనంత పద్మనాభ స్వామి రూపంలో గణనాథుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. సోమవారం నిమజ్జనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ఖానాపూర్ : జగన్నాథ్‌రావు చౌరస్తాలో..


పంచగుడి సమీపంలో గోదావరి వంతెన వద్ద..


ఖానాపూర్ : క్రేన్ సాయంతో నిమజ్జనం

మొరం తవ్వకం అడ్డగింత


గుట్ట వద్ద అనుమతుల్లేకుండా మొరం తవ్విన ప్రదేశం చూపుతున్న గ్రామస్తులు


తవ్వకాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

- జేసీబీ, ట్రాక్టర్లను ఊళ్లోకి తీసుకెళ్లిన పార్‌పెల్లి గ్రామస్తులు
- అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామ శివారులో భీమన్నగుట్ట, గోసమోడి గుట్టల వద్ద అక్రమంగా చేపట్టిన మొరం తవ్వకాలను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. మొరం తవ్వుతున్న ఓ జేసీబీ, రెండు ట్రాక్టర్లను గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలించినట్లు పార్‌పెల్లి వీడీసీ సభ్యులు, యూత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం గ్రామస్తులు గుట్టల వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అనుమతుల్లేకుండా గుట్టల నుంచి మొరం తీసుకెళ్తున్నారని అధికారులకు విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టా భూమి అని చెప్పి..

గ్రామ శివారులోని ప్రభుత్వ భూములకు డీ1 పట్టాలు తెచ్చుకొని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని పార్‌పెల్లి గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూములనే కొందరు వ్యక్తులు తమ పట్టా భూమి అని చెప్పి మొరంను గుట్ట నుంచి తరలిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏది ప్రభుత్వ భూమో, ఏది పట్టా భూమో గ్రామస్తులకు తెలియజేయాలని కోరుతున్నారు.

గుంతల్లో పడి 16 పశువులు మృతి..

భీమన్నగుట్ట, గోసమోడి గుట్టల నుంచి మొరం తరలిస్తుండటంతో పెద్ద పెద్ద కందకాలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలంలో గుంతల్లో నిలిచిన నీటిని తాగేందుకు వెళ్లి పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇలా ఇప్పటివరకు 16 పశువులు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ఏళ్లుగా గుట్టల నుంచి మొరం తరలిస్తుండటంతో గ్రామ పశువులకు మేత ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని తహసీల్దార్, ఎస్సై, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వకాలకు అనుమతి లేదు..

ఈ విషయమై సాక్షి తహసీల్దార్ సరితను ఫోన్‌లో సంప్రదించగా భీమన్నగుట్ట, గోసమోడి గుట్టల వద్ద మొరం తవ్వకాలకు అనుమతి లేదన్నారు. సోమవారం తమ రెవెన్యూ సిబ్బందిని పార్‌పెల్లి గ్రామానికి పంపి వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

‘లోలెవల్’తో అవస్థలు


అంబకంటి వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు


వెంకూర్‌లో వరదకు లోలెవల్ వంతెన వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

- వర్షాలు కురిస్తే గ్రామాలకు నిలుస్తున్న రాకపోకలు
- ప్రజలకు తప్పని తిప్పలు
- హైలెవల్ వంతెనలు నిర్మించాలని వేడుకోలు

కుంటాల: గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి రోడ్లను నిర్మిస్తోంది. కానీ వసతులు కల్పించకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కుంటాల మండలంలో 15 గ్రామ పంచాయతీలుండగా ఓలా–సూర్యాపూర్, ఓలా–లింబా(బి), కొత్త వెంకూర్–పాతవెంకూర్, కుంటాల–అంబకంటి గ్రామాల మధ్య నేటికీ నిజాం కాలం నాటి లోలెవల్ వంతెనలే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో రోడ్లు దెబ్బతినడంతోపాటు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి లోలెవల్ వంతెనల స్థానంలో వరద వెళ్లేలా హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మండలంలో సమస్యలివీ..

- మండలంలోని ఓలా–సూర్యాపూర్ గ్రామాల మధ్య లోలెవల్ వంతెనపై వరద ప్రవహించడంతో సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగామ గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.
- లింబా(బి) గ్రామం వద్ద రెండు లోలెవల్ వంతెనలపై వరద ప్రవహిస్తే లింబా(బి)తోపాటు కుభీర్ మండలంలోని చాత, చింతల్‌బోరి, పార్డి(బి), కుభీర్, భైంసా మండలంలోని సుంక్లి, వానల్‌పాడ్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- కొత్త వెంకూర్–పాత వెంకూర్ గ్రామాల నడుమ లోలెవల్ వంతెనపై వరద కారణంగా ప్రజలు ఏటా ఇబ్బంది పడుతూనే ఉన్నారు.


వెంకూర్‌లో లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద (ఫైల్)

ఇబ్బంది పడుతున్నాం



నేను నిత్యం ఉపాధి నిమిత్తం రోజు మా గ్రామం నుంచి కుంటాల వెళ్లి వస్తుంటాను. చిన్నపాటి వర్షం కురిసినా మా గ్రామం వద్ద ఉన్న రెండు లోలెవల్ వంతెనలపై వరద ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం.
– వి.సాయినాథ్, లింబా(బి)

పంటలు దెబ్బతింటున్నాయి



లో లెవల్ వంతెనపై వరద కారణంగా రోడ్లు కొట్టుకుపోతున్నాయి. పంటలు దెబ్బతింటున్నాయి. హై లెవెల్ వంతెన లేక కుంటాలకు వెళ్లాలంటే ఇతర మార్గాల నుంచి ప్రయాణిస్తూ ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి హై లెవెల్ వంతెన నిర్మించాలి. – వెంకట్‌రావు, పాతవెంకూర్

ప్రతిపాదనలు పంపాం

ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు పరిశీలించాం. మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.
– గౌరీశ్, పీఆర్ ఏఈ

ఇటీవలి వర్షాలకు అంబకంటి మార్గంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. సూర్యాపూర్ రాజరాజేశ్వరస్వామి ఆలయ సమీపంలో వంతెన వద్ద రోడ్డంతా కొట్టుకుపోయింది.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ, పిప్రి, గడ్‌చాంద గ్రామాల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, టీఏలు రవీందర్, హరిత, శారద, ఎఫ్ఏలు సాయన్న, రమేశ్ కూలీలు ఉన్నారు.

ఆలయాలు మూసివేత


దస్తురాబాద్‌లో మూసిన ఆలయం

దస్తురాబాద్: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మండలంలోని రేవోజీపేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, గొడిసీర్యాలలోని రాజన్న, దస్తురాబాద్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను మూసివేశారు. గ్రహణం అనంతరం సంప్రోక్షణ అనంతరం ఆలయాల్లో పూజలు చేయనున్నట్లు అర్చకులు వంశీధరచార్యులు, నరేశాచార్యులు, లక్ష్మణస్వామి తెలిపారు.

కొట్టుకొచ్చిన అరుదైన చేప


వింత చేప


మనిషి పళ్ల వలే చేప దంతాలు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన తోకల సంతోష్ అనే మత్స్యకారుడి వలకు ఆదివారం గోదావరి నదిలో కిలో బరువు ఉన్న అరుదైన చేప చిక్కింది. మానవుడి పళ్ల మాదిరి దంతాలు ఉండటంతో స్థానికులు చేపను ఆసక్తిగా తిలకించారు. మహారాష్ట్రలోని గోయిక్వాడ్ నది, నాసిక్ ప్రాంతంలోని చెరువుల్లో పెరిగే ఈ రూప్‌చంద్ రకం చేప వరదకు గోదావరిలోకి కొట్టుకొచ్చి ఉంటుందని జిల్లా మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్య తెలిపారు.

శోభాయాత్రలో ఉద్రిక్తత

ఖానాపూర్: వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఆదివారం ఉదయం జరిగిన శోభాయాత్రలో పలు మండపాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇంద్రనగర్, సుభాశ్‌నగర్ మండపాల యువకులు ఒకరినొకరు దూషించుకొని పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో పలువురికి గాయాలవగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా గొడవ విషయం తెలిసిన వెంటనే అందరిని చెదరగొట్టామని.. దీనిపై ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మామడ: మండలకేంద్రంలో ఆదివారం జరిగిన వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రతిమలు వెళ్లడం ఆలస్యం అవుతుందని ముందు కెళ్లాలని పోలీసులు చెప్పడంతో స్థానికులు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీసులకు, గ్రామస్తులకు వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు నచ్చజెప్పి నిమజ్జనం పూర్తి చేయించారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతల రోడ్డుపై ప్రయాణమెలా..?



తానూరు: ముథోల్ నుంచి తానూరు మండలంలోని దౌలతాబాద్ వెళ్లే బీటీ రోడ్డు తొమ్మిది కిలోమీటర్ల మేర జౌలా(బి) గ్రామం వరకు గుంతలమయంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో మరింత ఇబ్బంది అవుతుందని అధికారులు సమస్య పరిష్కరించాలని ఖర్బాలా, జౌలా (బి), తొండాల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : శివలింగయ్య, పీఆర్ ఏఈ, ఫోన్: 93460 69607

నేడు రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

సారంగాపూర్: మండలంలోని ఆయా పార్టీల రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ఉదయం 11గంటలకు సారంగాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకాంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. జాబితా పరిశీలించి అభ్యంతరాలుంటే తెలిపేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్టీల నేతలు ఆమోదించిన తర్వాత ఈనెల 10న తుది జాబితా వెలువరిస్తామని.. నాయకులు సకాలంలో రావాలని కోరారు.